


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మారుతున్న కాలంలో మారదాం.

**మేం అమీర్‌పేటలో అద్దెకుండేటప్పుడు** ఆ ఇంటావిడ తల్లి ఎనభయి ఏళ్ళావిడ. ఇమర్షన్ రాడ్ వేసుకుని నీళ్ళు కాచుకుంటుంటే "అమ్మాయి కరెంట్ నీళ్ళు మంచివి కావే తల్లీ, ఒక కాగు కొనుక్కో, మా పొయ్యి మీదనే పడేసుకో పనయ్యాక" అనేది.

పెరట్లో ఒక షెడ్, ఓ పక్కగా పిడకలూ, రైలు బొగ్గూ, కట్టెలూ, మూడు రాళ్ల పొయ్యీ.. ఇలాంటి వ్యవస్థ అంతా వుండేది. అసలు మా చిన్నతనంలో ఇలా పొయ్యిల మీద వాటి రూపూ రుత్తా పోగొట్టుకుని, అచ్చంగా బొగ్గుతోనే చేసారా అన్నట్లుండే నీళ్ళు కాచుకునే దేగిసాలూ, కాగులూ అందరిళ్ళల్లో వుండేవి.

పెళ్ళి అన్నా వేరే కార్యం అన్నా మా బంగారం పన్ను వంట క్రిష్ణమూర్తి వచ్చి, ఎక్కడ ఫంక్షన్ చేస్తున్నామో అక్కడ గాడిపొయ్యి ఎక్కడ వెయ్యాలో చాక్‌పీస్‌తో గీసి, ఆ తర్వాత గాడిపొయ్యి మూడు పెద్ద పెద్ద రాళ్ళు తెచ్చి వేసి, పసుపు కుంకాలు పెట్టి, పూజచేసి ఓ తలకాయంత వినాయకుడి లడ్డూ చేసి నైవేద్యం పెట్టి, ఆనక ఇంటికి తన పిల్లలకి తీసుకువెళ్ళేవాడు.

ఈ గాడిపొయ్యి పొగలవల్ల, స్నానానికి వెళ్ళే ఆడవాళ్ళూ, మగవాళ్ళూ కళ్ళు మూసుకునే నాలుగిళ్ళ చావిళ్ళలో ఒకరితో ఒకరు ముచ్చట్లు చెప్పుకోడం, పోట్లాడుకోవడం చూసేదాన్ని చిన్నతనంలో.

మా అమ్మమ్మ మా చేతకూడా చితుకులూ, కర్రపేళ్ళూ ఏరించేది. ఇంక పొట్టుపొయ్యీ, కుంపటీ సాధారణంగా వుండేవి ఇళ్ళల్లో. రంగనాయకమ్మగారి నవలల్లో కూడా కుంపటి మీద కాఫీ, విమల కుంపటి విసురుతూ నవల చదువుకోవడం, బుచ్చిబాబు తదేకంగా విమల చెవులకేసి చూస్తూ అవి కుప్పెలా? బుట్టలా .. అని ఆలోచించడం.. ఇలా వుండేవి బొమ్మలు.

బాపూగారూ, ముళ్ళపూడి వెంకట రమణగారూ అయితే కుంపటి విసురుతూ అక్కడ పొద్దుట కాఫీ టైంలో సాగే అమ్మా నాన్నల చిలిపి చూపుల రొమేన్స్‌లు కళ్ళకి కట్టారు. అసలు శ్రీరమణగారు మిధునంలో అప్పదాసు, దీపావళి సరంజామా, బాణాసంచా ఎండపెట్టి పిల్లలు పొందే ఆనందం ఈ కొబ్బరి చిప్పలూ, మావిడి టెంకలూ, తాటి పెచ్చులూ ఎండపెట్టినప్పుడు అప్పదాసు కళ్ళల్లో కనిపించేదన్నారు. నిజమే. పెద్దవాళ్ళున్న ఇళ్ళల్లో ఇళ్ళమందు చాటల్లో బియ్యం రవ్వో, ఆవాలో, దొండ ఒరుగులో, ఏమీ లేకపోతే కాయితాలూ, పసుపూ వేసి రుబ్బి పట్టించిన, ఒట్టి చాటలో వుంటాయి. అదే ఈ కాలం వాళ్ళ ఇళ్ళముందు పొద్దుటేసిన పేపరూ, పాలపాకెట్లు కూడా బోలెడు పొద్దెక్కేదాకా పడి వుంటాయి. ఇంక అమెరికాలో పిల్లల ఇళ్ళముందు మనం పంపిన పచ్చళ్ళ కొరియర్లు కూడా ఒకటి రెండు రోజులు పడి వుంటాయి. తర్వాత గేరేజ్‌లోకి వెళ్ళి మూడు నిద్రలు చేసాక, వీక్ ఎండ్స్‌లో ఇంట్లోకీ, పాంట్రీలోకీ చేరితే గొప్ప. టైములు లేవు మరి.

ఇంతకీ అమీర్‌పేట్‌లో పెద్దావిడ 'కరెంట్ నీళ్ళు' ఒంటికి చెడుపు చేస్తాయి అనేది. నిజమే కరెంట్ మీద వంటా, మైక్రోవేవ్ వాడకం అంటే కాన్సర్ వస్తుందేమో అని చాలామందికి భయం. ప్లాస్టిక్ వాడకం, ప్లాస్టిక్ కవర్లలో పాలూ, కూరలూ కొనడం, ప్లాస్టిక్ బాటిల్స్‌లో తాగడం. ఇలా అన్నీ మానెయ్యమని చాలామంది చెప్తుంటారు. చివరికి 'డిప్ డిప్' శాషేల పొట్లాలు, దారం బయటకుండి, కప్పులో వేడి నీళ్ళలో వేసి తాగడం కూడా మంచిది కాదని కొంతమంది చెప్తారు. శానిటరీ నేప్‌కిన్స్‌లో కూడా ప్లాస్టిక్ లోపల వైపున వుండి చెమ్మ బయటకి రానియ్యదు ఆడవాళ్ళ పిరియెడ్స్ టైములో, అదికూడా హానికరం, బాడీకి అంత క్లోజ్ కాంటాక్ట్ అని అవి తీసేసారు. అసలీ ప్లాస్టిక్ వాడకం మానవాళి జీవితంలోకి ఓ ప్రభంజనంలా వచ్చింది.

మా చిన్నతనంలో రోజూ రెండు గాజు సీసాలు తీసుకుని పాలబూత్‌కి వెళ్ళేవాళ్ళం. ముందు రోజే అమ్మలు, పాలకి కావలసిన చిల్లర నాణాలు వాటిలో వేసి వుంచేవారు. ఖాళీ సీసాలిచ్చాక ముచ్చితపు కాయితాల మూతలతో వున్న నిండు సీసాలిచ్చేవాళ్ళు డబ్బులు తీసుకుని. నీలం రంగు కవర్ వుంటే, తియ్యగానే ఓ బిళ్ళలా వెన్న గిన్నెలో పడేది. ఆకు పచ్చరంగుకి తక్కువ వెన్న శాతం వుండేది. అవి కడిగి గూట్లో దాచేవాళ్ళం. అప్పుడప్పుడూ మా చేతుల్లో పగిలి, మా వీపులు చిట్లి, కొత్తవి కొనాల్సి వచ్చేవనుకోండి. సడెన్‌గా ఈ పాల కవర్లు రంగంలోకి వచ్చాయి. అంతే ఆడవాళ్ళు పాల కవర్లతో ఉపయోగాలు అనే విషయం మీద పరిశోధనలు చేసి రెచ్చిపోయారు. అవన్నీ పాలు తీసాక కడిగి దాచడం మొదలు పెట్టారు. సోడా, సర్ఫూ, వేడినీళ్ళూ వేసి బాగా జాడించి ఎండపెట్టి, అవి కుట్టి వడియాలు పెట్టడానికీ, వాటిమీద బొబ్బట్లూ, బజ్జీలూ, గారెలూ, వేసుకోడానికీ వాడేవారు. ఇంకొంతమంది అవి రకరకాలుగా కుట్టి బొమ్మలూ, గొడుగులూ, కూరల సంచిలుగా తయారు చేసేవారు. తరువాత తరువాత ఇంటి ముందుకి 'పాల కవర్లు కొంటాం'అని వచ్చే వాళ్ళని చూసి 'పావలా పరకా' కి జాక్‌పాట్ కొట్టినట్లూ, హౌస్ వైఫ్స్ ఆనందించడం మొదలు పెట్టారు.

కానీ మానవాళికే కాక ఈ ప్లాస్టిక్ పేపర్ వాడకం వల్ల ప్రకృతికీ, సమస్త ప్రాణ కోటికీ అపకారం జరుగుతోంది. భూమిలో నివసించే అనేకానేక పురుగులకీ, సహజంగా వానజల్లులకి మొలకెత్తే గడ్డికీ, వాటన్నింటికీ అడ్డుగా చెత్తలో ఈ ప్లాస్టిక్ కాయితం నిలుస్తోంది. పశువులు వాటిలో వేసి పారేసే కూరగాయల తుక్కు, మిగిలిన ఆహారపదార్థాలకీ ఆశపడి, ఆ ముడులిప్పి,తినడం చాతకాక అవి మింగేస్తున్నాయి. ఇంక ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, టీ గ్లాసులు, కోక్ టిన్నులు ఇవన్నీ కూడా పశువుల కడుపుల్లో చేరడం బోలెడు మంది జంతు ప్రేమికులు వీడియోలలో చూపిస్తున్నారు.

మా ఆఖరి బాబాయ్ పెళ్ళి నాకు పదేళ్ళ వయసున్నప్పుడు జరిగింది అనుకుంట. అప్పుడు మొదలయింది ఈ ప్లాస్టిక్ ఉద్యమం. పెళ్ళికొచ్చిన చాలామంది మధ్య తరగతి వాళ్ళే అవడం మూలానా, ప్రెజెంటేషన్ ఇవ్వాల్సిందే.. ఎంత పెద్ద ప్యాకెట్ అయితే అంత గొప్పగా వుంటుది అని భావించడం మూలానా ప్లాస్టిక్ బకెట్లూ, చెంబులూ, బిందెలూ, ప్యాక్ చేసి తెచ్చి ఇచ్చారు.

వంట ఇళ్ళల్లో షెల్ఫుల్లో అమాయకంగా లోపలేవీ దాచుకోలేక, బోసినవ్వులు నవ్వుతూ కనిపించే హార్లిక్స్ బాటిల్స్ స్థానే ఈ ప్లాస్టిక్ డబ్బాలు నిండాయి. అసలు ఆ సీసాల కోసం అయినా పిచ్చి తల్లులు పిల్లలకి హార్లిక్స్, వీవాలాంటి పౌష్టికాహారాం ఇచ్చేవారనుకుంట.

ఆడదానికీ ఈ డబ్బా, సీసాల వ్యామోహాలకీ అవినాభావ సంబంధం వుంది. మా అబ్బాయి నా టప్పర్ వేర్ వాటర్ బాటిల్స్ తీసుకెళ్ళి ఏ ఫ్రెండ్ కార్లోనో మరిచిపోయి వస్తే, నేను నా వాటర్ బాటిల్ ఏది?' అని వాకిట్లో నిలదీసేదాన్ని.

ఆ 'టప్పర్ వేర్' మీద చాలామంది మిడిల్ క్లాస్ ఇల్లాళ్ళు వ్యాపారం చేసి భవిష్యత్ నిర్మించుకున్నారు. వంట గది షెల్ఫుల్లో 'పర్ల్‌పెట్' డబ్బాలుండడం ప్రెస్టేజ్ ఇష్యూ అన్న దశకొచ్చారు. టీవీ ఏడ్వర్‌టైజ్‌మెంట్‌లో ఆడవాళ్ళు అందంగా చీరకట్టుకుని, అందంగా తయ్యారయి, పర్ల్‌పెట్ జార్స్‌లో వస్తువులన్నీ పోసి చూపెట్టడంతో మిడిల్ క్లాస్ ఆడవాళ్ళు ఆ వైపు మొగ్గు జూపారు. అప్పటిదాకా మిలమిలా తోమి మెరుస్తూ పెట్టుకున్న స్టీలు డబ్బాలు మాయం అయ్యాయి. తాతల, అమ్మమ్మల నాటి ఇత్తడి, రాగీ, కంచూ మొదలైన డబ్బాలూ, చెంబులూ పూర్తిగా మాయం అయి ఆ లోహాల విలువ తెలియక చవకగా అమ్మేసి ప్లాస్టిక్ వస్తువులు కొనుక్కున్నారు.

అమీర్‌పేట్‌లో పెద్దావిడ కరెంట్ నీళ్ళు మాత్రమే వద్దంది కానీ చాలామంది ఆ రోజుల్లో గ్యాస్ పొయ్యి వంటలని సైతం వ్యతిరేకించారు.

వాళ్ళందరికీ బొగ్గుల పొయ్యి వూది వూది ఆడవాళ్ళు టైముకి పిల్లలకీ, మొగుళ్ళకీ టిఫిన్ డబ్బాలు కట్టలేని అవస్థా, కిరోసిన్ దొరకక గంటల తరబడీ క్యూలల్లో నిలబడే వారి బాధలూ అర్థం అయ్యాక, ఎలాగో అలాగ వంట పూర్తి చెయ్యనీలే అని నోళ్ళు మూసుకున్నారు. లేదా వాకిట్లో పడక కుర్చీలో పడుకుని, కాఫీలు తాగుతూ 'మా అమ్మమ్మ పాలు కుంపటి మీద కాచి చేసే కాఫీకి ఇది సరి కాదండీ.. పప్పు కుంపటి మీద వేయించి వండితే ఆ రుచే వేరండీ" అని కబుర్లు చెప్తుండేవారు.

గీజర్ ఆన్ చేసుకుని, పిల్లలకీ పెద్దవాళ్ళకీ ఒక్కసారిగా నీళ్ళు కాగితే, స్నానాలు చేసి ఒకే టైములో ఇంటిల్లిపాదీ ఆఫీస్‌లకి వెళ్ళే ఈ యుగంలో కరెంట్ నీళ్ళు పోసుకోవద్దు అంటే ముఖ్యంగా విదేశాల్లో అది అయ్యేపని కాదు. అసలు 'కరెంట్'లేకపోతే వంటకాదు. నీళ్ళు వుండవు. అసలు ఏ పనీ చెయ్యలేం. ఇండియాలో వేడికి ఫ్యానూ, ఏసీ ఏకధాటిగా తిరగకపోతే ఎండాకాలం చచ్చేపోతాం. కరెంట్ లేకుండా మానవ జీవితం లేదు" మా చిన్నప్పుడు 'గూట్లో దీపం.. నోట్లో ముద్దా' అని, ఆరయ్యేసరికి దీపాలు వెలిగించుకుని, అన్నాలు తినేవాళ్ళం" అని అమ్మమ్మలు చెప్పచ్చు.

కానీ పగలూ, రాత్రీ అని లేకుండా వివిధ వృత్తులు చేస్తున్న కార్మికులూ, ఉద్యోగస్తులూ అలా పాటించగలరా? ఎలక్ట్రిక్ బల్బ్, టెలిఫోన్, టెలివిజన్, గ్రైండర్, గీజర్.. ఇలాంటి విప్లవాలతోబాటు ఇప్పుడు అమెరికా వీధుల్లో డ్రైవరే లేకుండా 'ఊబర్' కార్లు జనాన్ని ఎక్కించుకుని గమ్యస్థానం చేరుస్తున్నాయి. ఇంత పురోగమించినా మానవుడు ఇప్పటికీ పాత అలవాట్లే గొప్పవనీ, అప్పుడు అందరూ  ఆరోగ్యంగా వుండేవారమనీ, ఫేస్‌బుక్‌లలో, ఇతర సోషల్ మీడియాలలో పోస్ట్‌లు పెడ్తుంటారు. అందులో నిజం వుండచ్చు. ఇప్పుడు ఆహారం కల్తీ, గాలి కలుషితం, నీరు కలుషితం... సత్యాలే. కానీ మారుతున్న కాలంలో, మారను అని ఎస్కలేటర్ ఎక్కకుండా 24 అంతస్తులు కాళ్ళతో ఎక్కుతారా?

బయటకి వెళ్తే ప్యాక్ చేసిచ్చే ఆహారం పాకెట్లు వద్దని మనం మన పాత్రలో వేసి ఇమ్మని అడగగలమా?

కానీ కొన్ని చెయ్యగలం. తాగిన తరువాత, తిన్న తరువాత ఈ ప్లాస్టిక్ సామాన్లు అందమైన పర్యావరణ స్థలాల్లో పారేసి వస్తారు కొంతమంది. అలా చెయ్యకుండా అవన్నీ జాగ్రత్తగా తీసుకొచ్చి, రీ సైకిల్ బిన్‌లలో వెయ్యాలి.

కూరగాయలకీ, పచారీ సామాన్లకీ బట్ట సంచి మనం తీసుకెళ్ళగలం. ఆహారం కాయితంలో పొట్లం కట్టి ఇవ్వమందాం. మా చిన్నప్పుడు ప్రొవిజన్స్ కాయితపు పొట్లాలతోనే వచ్చేవి. అవి చదువుకుంటూ, విప్పి, సామాన్లు డబ్బాలలో పోసుకుని పఠనాభిలాష పెంచుకున్నాం. బాధ్యతారహితంగా ప్లాస్టిక్ ఎక్కడ పడితే అక్కడ పారెయ్యకూడదు.

పర్వతారోహణ చేసేవాళ్ళు మలమూత్రాలు కూడా అక్కడ వదిలి రాకూడదు. అవి పవిత్ర స్థలాలు ,అది స్ట్రిక్ట్ రూల్.

జైనులు ముక్కుకి కూడా బట్టకట్టుకుంటారు, చివరకి గాలిలో వున్న క్రిమికీటకాలకి కూడా వారినుండి హాని జరగరాదని. భూమి లోపల పెరిగే దుంపలని ఆహారంగా తీసుకోరు. అవి పెకిలించి తీసుకున్నాక, మొక్క జీవితం ముగుస్తుందని. ఆకుకూర మడులలో పురుగూ పుట్రా నివాసం వుంటాయి అని వర్షాకాలం  అవి ఆహారంగా తీసుకోరు, సాత్వికాహారం తింటారు. మనలోని సాత్వికతని పెంచుకోడానికి ఉల్లీ, వెల్లుల్లీలాంటివి తినకుండా.

పూర్వీకులు చెప్పినవీ ఆచరించినవీ మనం ఈ టెక్నాలజీ యుగంలో చెయ్యలేం. ఇల్లు వూడవడం , బట్టలు ఉతకడం, అంట్లు తోమడం, ఒకటేమిటి అన్నీ కరెంటు తోటే. ఆడవాళ్ళు సుఖపడే యుగం ఇది. ఈ సుఖాలని కాదని అమెరికాలో కొంతమంది భార్యలని నెలకి మూడురోజులూ బయట కూర్చోపెట్టి, చాపా, బొంతా, చెంబూ ఇస్తున్నారని ఓ అమ్మాయి చెపితే విని ఆశ్చర్యపోయాను కూడా. మా మామగారు వాషింగ్ మిషిన్‌లో బట్టలు ఉతికితే ఒప్పుకోరు.. మా ఆయన

కుక్కర్‌లో అన్నం వండితే తినరు.. మా అత్తగారు గ్రైండర్‌లో మిక్సీలో పచ్చడి చెయ్యొద్దంటారు అని కొంతమంది రాసినా, చెప్పినా, నాకు విడ్డూరం అనిపిస్తుంది. కానీ వున్నారు.. ఇంకా అలాంటివాళ్ళు. మనం పాత ఆచారాలనీ ధర్మాన్నీ కాపాడ్తున్నాం అనుకుంటూ వుంటారు.

పొద్దుట లేచి, ఇల్లు సవరించుకుని, పిల్లలని తయారు చేసి, బ్రేక్‌ఫాస్ట్ చేసిపెట్టి, స్కూల్‌కి పంపించి, భర్తతోపాటు తనూ బయల్దేరి ఆఫీసుకి వెళ్ళే అమ్మాయికి ఇలాంటి 'నోస్టాల్జియా' బోధించే పోస్టులూ, పాత అలవాట్లు మంచివనే పాఠాలూ చెపితే అసలు ఏం చెయ్యగలదు? ఏమీ చెయ్యలేదు.. ఎన్నో చేస్తున్న స్త్రీకి ఇవన్నీ అద్భుత వరాలు. నువ్వెన్నో చెయ్యగలవు..కేవలం రోట్లో పిండి రుబ్బడం, బట్టలు బండకేసి బాదడం మాత్రమేకాదు అని చెప్పి యాభై సంవత్సరాలు కావస్తోంది.

కానీ నేను ఈ కాలమ్ రాయడానికి కారణం ఇంకా సోషల్ మీడియాలో కొందరు 'ఈ రోలూ రోకలీ' గ్రూపులు పెట్టి, రోజూ మీరు చేస్తున్న పనులు అనారోగ్యం.. మీరంతా మళ్ళీ పాత కాలం 'రాతి యుగం' వైపు మళ్ళండి అని చెప్పడం చూసి, ఇది రాస్తున్నా. కొన్ని మార్పులతో కొత్త తరంలో హాయిగా బ్రతుకుదాం.

Post your comments





